కథ

# భార్యాత్వం

''బాగా చదువుకున్న అమ్మాయిని చేసుకోవాలనుంది మేడమ్!'' అని శ్రీధర్ అన్నపుడు నాకు చాలా ముచ్చటేసింది. అతను నా సహోద్యోగి. రెండేళ్ళుగా పరిచయం. మంచి కుర్రాడు అని నా అభిప్రాయం.

''ఎందుకు?'' అన్నాను నవ్వుతూ.

అంత అడ్డగోలు ప్రశ్న వేసినందుకు అతను నావైపు ఆశ్చర్యంగా చూశాడు.

''ఎందుకేమిటి మేడమ్! చదువు వ్యక్తిత్వాన్నిస్తుంది కదా'' అన్నాడు.

''వ్యక్తిత్వం వున్న పిల్ల కావాలంటావు అయితే''

''అంతేకదా మేడమ్! వ్యక్తిత్వం లేని అమ్మాయిని చేసుకుంటే లైఫ్‌లో థ్రిల్ ఏముంటుంది? ఆనందం ఏముంటుంది''

అతని మాటలు వింటుంటే నా మనసులోకి మాధవి వచ్చి నిలిచింది. అది నాకు పిన్ని కూతురు. కానీ స్వంత చెల్లెలి కంటే ఎక్కువే.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు మాధవి చిన్నప్పటినుంచే తన ప్రతిభని అన్ని రంగాలలోనూ చాటుకుంది. పదహారేళ్ళు వచ్చేసరికి ఆ ప్రతిభ మరింతగా ప్రకాశించింది. ఆ తర్వాత ఇంజనీరింగ్ చదువు మంచి ఉద్యోగాన్నీ, హోదానీ యిచ్చింది.

మాధవిని చూసి మా వాళ్ళందరూ ''దానికేం! అందాల బొమ్మ. మంచి మొగుడొస్తాడు'' అంటారు.

కానీ శ్రీధర్ మాటలు విన్నాక, దాని అందాన్ని ఆరాధించే వాడికన్నా, వ్యక్తిత్వాన్ని మెచ్చుకునే భర్త దగ్గర అది ఎక్కువ సుఖపడ్తుందని అనిపించింది.

క్షణం ఆలశ్యం చేయకుండా ఒకరికొకర్ని పరిచయం చేశాను.

మాధవి అభ్యంతరం చెప్పలేదు. శ్రీధర్ అయితే ఎగిరి గంతేసినంత పనిచేశాడు.

నేనే మధ్యవర్తిత్వం వహించి పెద్దవాళ్ళతో మాట్లాడి, వాళ్ళిద్దరి పెళ్ళి జరిపించాను.

ఇద్దరూ అన్యోన్యంగా వుండాలనీ, వుంటారనీ ఆశించాను.

మూడు నెలలు తిరిగాయో లేదో-

ఒకరోజు చీకటి పడుతూండగా మాధవి మా ఇంటికి వచ్చింది. మొహం వాడిపోయి వుంది.

''ఏమైందే!'' అన్నాను.

అంతే, కళ్లలోకి చివ్వున నీళ్ళుబికి వచ్చాయి.

''ఆయనకి జీతమెంత?'' అంది నా కళ్లలోకి సూటిగా చూస్తూ.

''పదిహేను వేలదాకా వస్తుంది. ఏం?''

''అప్పులెన్నున్నాయి?''

''అప్పులా!'' నేను ఆశ్చర్యపోయాను. ''నాకు తెలీదే!'' అన్నాను.

''మూడు లక్షలకి పైగా అప్పుందిట''

''అంత అప్పా! ఎందుకు చేశాడు?''

''ఏమో! చెప్తేగా తెలిసేది'' పెదవి విరిచింది మాధవి.

నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

''ఆయన డబ్బులు ఆయన పెట్రోలు ఖర్చులకే చాలవుట. అందుకని నా ఖర్చులూ, ఇంటి ఖర్చులూ అన్నీ నేనే చూసుకోవాలిట''

''నువ్వెందుకు చూడటం! నువ్వేం చూడకు''

''చూడకపోతే ఎలా! తిండి తినాలిగా''

''నువ్వు బయట తిను. ఇంట్లో వంట చేయకు. వంట నీ ఒక్కదాని బాధ్యతా కాదుగా! అతను సరుకులు తెస్తే వంటచేయి. లేకపోతే లేదు''

మాధవి నావైపు బ్లాంక్‌గా చూసింది.

క్షణం తర్వాత ''ఇంతేనా యింక'' అంది స్వగతంగా అనుకుంటున్నట్లు.

''అంతేనా అంటే... అంతే ఎందుకు అవుతుంది? గట్టిగా అడుగు అతన్ని. ఎందుకలా అప్పులు చేయవలసి వస్తోందో... ఏమిటో'' అన్నాను నేను నసుగుతూ.

''గట్టిగా అడిగాననే కోపం వచ్చింది. నేను గయ్యాళిలాగా అరుస్తున్నానట''

నేనేం మాట్లాడలేనట్లు చూస్తుంటే మళ్ళీ తనే చెప్పింది-

''మెల్లగా అడిగితే చెప్పరు. గట్టిగా అడిగితే, నువు గట్టిగా అడిగావు కాబట్టి అసలు చెప్పనంటారు. చూశావా! పెళ్లయిన మూడు నెలలకి భర్త దగ్గర నేను సంపాదించుకున్న బిరుదు గయ్యాళి!'' విరక్తిగా నవ్వింది.

నాకు అర్థమయింది దాని బాధ. ఇప్పటివరకూ అందరితో ''జీనియస్, మేధావి, స్వప్నసుందరి, మిస్ ఇండియా'' అని అనిపించుకున్న అమ్మాయి... అందరికంటే ఎక్కువ ఆదరణ పొందవలసిన భర్త దగ్గర 'గయ్యాళి' అనిపించుకోవడం ఎంత బాధాకరమో నాకు తెలిసింది.

కానీ నేనేం చేయగలను. అసలు దాని కళ్ళలో నీళ్ళు చూస్తేనే నాకు మతిపోయింది. పుట్టి బుద్ధెరిగాక యింతవరకూ ఎప్పుడూ ఏడవలేదు అది.

ఏదో పార్టీలో కలిసినపుడు దాని కొలీగ్ అన్నాడు ఒకసారి నాతో, ''మాధవిగారిని చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుందండి. ఇంత చిన్న ఏజ్‌లో ఎంత గంభీరంగా వుంటారో! నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంది, కాలేజ్‌లో ఈవిడకి సీనియర్‌గా వుండి ర్యాగ్ చేస్తే ఏం చేసి ఉండేవారా అని!''

''అదేమిటి?'' అన్నాను నేను నవ్వుతూ.

''ఆవిడ ఏడిస్తే చూడాలని సరదా అండీ. ఇప్పుడు ఏడిపించలేం కదామరి!'' అన్నాడతను నవ్వుతూ.

అదంతా గుర్తొచ్చి, ''ఎక్కడున్నాడో మహానుభావుడు!'' అనుకున్నాను.

ఆ రాత్రి మా యింట్లోనే వుండి, మర్నాడు వెళ్లింది మాధవి.

నేను చెప్పాననో, ఇచ్చి ప్రయోజనం లేదని తనకూ అర్థమవడం వల్లనో, శ్రీధర్‌కి డబ్బులివ్వడం మానేసింది.

గొడవలు యింకాస్త పెరిగాయి.

అతనికి యివ్వకపోవడమే కాదు, తనూ సరిగా ఖర్చుపెట్టేది కాదు. పిల్లలు పుడితే ఎలా? అన్న భయం ఒకటి ఆవరించింది దాన్ని. అలా అని పిల్లలు వద్దనుకోలేని బలహీనత.

సంపాదించిన ప్రతి పైసా దాచిపెట్టేస్తుంది. నగలు కాదుకదా మంచి చీరలు కూడా కట్టడం లేదీ మధ్య.

భార్యాభర్తలిద్దరూ కలిసి నెలకి ముప్పై వేలు సంపాదిస్తున్న ఇంట్లో సరైన తిండిలేదు. సరైన బట్టలు లేవు. ఆ పరిస్థితి చూస్తూ కూడా ఏమీ చేయలేని అసహాయత నాది.

ఈ నెల మా ప్రాజెక్టు పూర్తయింది. శ్రీధర్‌దీ నాదీ ఒకే గ్రూప్. అందరికీ ప్రాజెక్ట్ బోనస్ వచ్చింది. తలా పదిహేను వేలు.

ఆ విషయం మాధవితో చెప్పినట్లుంటుందీ, తనను చూసినట్లుంటుంది అని లంచ్ టైమ్‌లో తన ఆఫీసుకి వెళ్లాను.

అందరూ లంచ్ చేస్తుంటే మాధవి ఒక్కతే ఒక మూల దిగులుగా కూర్చుని వుంది. ''అన్నం తినడం లేదే!'' అన్నాను నేరుగా వెళ్ళి తన ఎదురుగా కూర్చుంటూ.

నన్ను చూడగానే మొహం విప్పారింది. ''తెచ్చుకోలేదు'' అంది సన్నగా నవ్వుతూ.

''ఏం ప్రొద్దున వంట చేయలేదా?''

''చేశాను''

''మరి!''

మాధవి యిబ్బందిగా నవ్వింది ''లేటయిపోయింది. హడావుడిగా వచ్చేశాను''

''బాక్స్ తెచ్చుకునే టైం లేదా?'' అను రెట్టించాను.

ఒక్క క్షణం నావైపు తదేకంగా చూసింది మాధవి. ఆ తర్వాత చెప్పింది. ''శ్రీధర్ వాళ్ళ అక్కావాళ్ళు వచ్చారు మొన్న రాత్రి. నిన్న సెలవు పెట్టాను. ఈరోజు కూడా పెట్టమన్నారాయన. నాకేమో అస్సలు సెలవు పెట్టే పరిస్థితి లేదు. ప్రొద్దున్నే త్వరగా లేచి వంట పూర్తి చేశాను. ఆయన వాళ్ళ అక్క కూతురితో ఆడుకుంటూ కూర్చున్నారు. 'బస్‌స్టాప్ దాకా స్కూటర్ మీద డ్రాప్ చేస్తారా! లేటయ్యేలా వుంది' అన్నాను ఆయనతో. అంతే ఇక కోపమంతా బయటపడింది. 'అసలు నీకు మా అక్కావాళ్ళు వచ్చారని కడుపుమంట. అందుకే యివాళ కూడా ఆఫీసుకి తయారయ్యావు. అంత పొగరు వున్నదానివి నువ్వే వెళ్ళచ్చుగా. మళ్ళీ నన్ను డ్రాప్ చేయమని అడుగుతావే' అన్నారు. ఆయన లేకుండా ఒక్కరోజు ఆఫీసుకి వెళ్ళడం చేతకాని చవటనట నేను. ఇంకా ఏమిటో చాలా చాలా అన్నారు. ఆ పసిపిల్లని చూసి నేను కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నానట. ఆయన దానితో ఆడుకుంటుంటే నేను భరించలేకపోయానుట''

మాధవి చెప్తుంటే నేను ఆశ్చర్యపోయాను. ''నిజమా! అలా మాట్లాడారా శ్రీధర్! ఎందుకు? నువ్వేమైనా పోట్లాడావా మీ ఆడపడుచుతో'' అన్నాను.

మాధవి దిగులుగా నవ్వింది ''ఇప్పటివరకూ నేను ఎవరితోనైనా పోట్లాడగా చూశావా అక్కా'' అంది.

నేను గతుక్కుమన్నాను.

నిజమే, మాధవి పోట్లాడటమేమిటి? అది అజాత శత్రువు. ఎట్లాంటి వాళ్ళతోనైనా నిమిషంలో ఫ్రెండ్షిప్ చేయగల నేర్పరి.

నా మాటని ఎలా వెనక్కి తీసుకోవాలో అర్థం కాక ఒక్క క్షణం తటపటాయించి... ''అయినా యింత చిన్న విషయానికి బాధపడి అన్నం మానేయడమేమిటి మధూ! అతను డ్రాప్ చేయకపోతే నువ్వు ఆటోలో రావచ్చు కదా! అసలు శుభ్రంగా ఒక స్కూటీ కొనుక్కో. అతని మీద ఆధారపడకుండా నీ దారిన నువ్వు రావచ్చు'' అన్నాను.

నా కళ్ళలోకి ఒకసారి చూసి తల దించుకుని ''బాధపడకుండా ఎలా వుంటానక్కా! ఏనాడూ పరుల సొమ్ముకి ఆశించని వాడికి దొంగతనం అంటగడితే బాధపడడా! చీమకు కూడా అపకారం తలపెట్టని వాడిమీద హత్యానేరం మోపితే బాధపడడా! అందరితో ఎంతో మంచిగా వుండే నన్ను పట్టుకుని 'నీకు కడుపుమంట' అంటే నాకు బాధగా వుండదా! అందులోనూ... ఆ పసిపిల్లని చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నానట నేను! ఎంత దారుణమో చూడు. ఆయన కళ్ళలో కనిపించే చిరాకు చూస్తే, ఆయన మాటలు వింటుంటే నామీద నాకే అనుమానం వస్తుంది. నిజంగానే నేను కుసంస్కారినేమో! అసూయాపరురాలినేమో అనిపిస్తుంది'' దాని గొంతు రుద్ధమయింది.


నాకు దాన్ని చూస్తే జాలేసింది. శ్రీధర్ యిలా ప్రవర్తిస్తున్నాడంటే ఆశ్చర్యమూ వేసింది.

''సరే కానీ! నువ్వేమిటి యిలా వచ్చావు! పూరికేనా'' అంది మాధవి కాసేపటికి తేరుకుని.

''ఏం లేదు. శ్రీధర్‌కి పదిహేను వేలు బోనస్ వచ్చింది. అది చెబుదామని వచ్చాను. వాళ్ళ అక్కావాళ్ళు వుంటారా రెండ్రోజులు''

''లేదు. నేను ఇంటికి వెళ్ళేసరికి వెళ్ళిపోతారు బహుశా''

''సరే, వెళ్ళగానే ప్రొద్దుటి చికాకులేవీ మనసులో పెట్టుకోకుండా చక్కగా స్నానం చేసి ఫ్రెష్ అవ్వు. అతనితో సామరస్యంగా మాట్లాడు. ఆ డబ్బులు అడిగి తీసుకో''



''ఇవ్వద్దూ!'' అంది మాధవి విరక్తిగానవ్వుతూ.

''ఎందుకివ్వడు? అయినా నువు కూడా కాస్త నేర్చుకోవాలి మధూ! ప్రతిదానికీ వాదించకు అతనితో. వాదాలతో పనులు కావు. నెమ్మదిగా అతనికి బాధ్యతలు తెలియజేయాలి. సంసారమంటే అతన్ని సంతోషపెట్టాలి. నువు సంతోషపడాలి. పోనీ అతను కోరినట్లే సామరస్యంగా మాట్లాడు. నెక్లెస్ చేయించుకుంటానండీ అని ముద్దుగా అడుగు, ఎందుకివ్వడో చూద్దాం''

సలహా చెప్పి ఇంటికి వచ్చాను. రాత్రంతా మాధవి కళ్ళలో మెదులుతూనే వుంది. తెల్లవారి ఆఫీసుకి రాగానే మాధవి ఆఫీసుకి ఫోన్ చేశాను. ''హలో!'' అంది పెద్దగా. అదోలాంటి ఉన్మత్తత వినిపించింది ఆ గొంతులో.

దానిని హుషారుగా అర్థం చేసుకుంటూ ''ఏమయింది'' అన్నాను నేను కూడా హుషారుగా.

''ఏమయిందా! నువు చెప్పినట్లే యింటికి వెళ్లాను. స్నానం చేశాను. పెళ్ళప్పటి తెల్లచీర కట్టుకున్నాను. అచ్చంగా నువు చెప్పినట్లే నా మైండ్ ఫ్రెష్‌గా అయిపోయింది. వాకిట్లో విరజాజులు పూస్తే ఓపికగా కోసి మాల కట్టి పెట్టుకున్నాను. దాంతో మనసు మరీ మధురం అయిపోయింది. ఆ తర్వాత ఆయన వచ్చారు. పతివ్రతా శిరోమణులను మించిన సహనంతో ఓలలాడుతూ ఆయనకి భోజనం పెట్టాను. ఆ తర్వాత ఆయన ప్రేమగా దగ్గరకు తీసుకుంటే పరవశించిపోయాను...''

''సరేలే!'' అన్నాను నవ్వుతూ. ఒకే ధోరణిలో చెప్పుకుపోతున్న మాధవిని ఆపి, ''అదంతా అక్క

టి.శ్రీవల్లీ రాధిక

ళ్లేదు కాని, అసలు విషయం చెప్పు'' అన్నాను.

''వస్తున్నా! విను మరి'' అంది మాధవి.

ఆ గొంతులో ధ్వనించిన పదునుకి నేను ఆశ్చర్యపోతుంటే వినిపించాయి తన మాటలు.

అర్ధరాత్రి పన్నెండయిందేమో అప్పుడు! ఆయన గుండెల మీద చుబుకం ఆనించి, కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ ''ఏమండీ! బోనస్ వచ్చిందటగా!'' అన్నాను. నేనీమాట అంటూండగానే ఆయన నోట్లో నుంచి దూసుకు వచ్చాయి ''ఓహో! అందుకా ఇందాకటి నుండీ యిన్ని వగలు కురిపిస్తున్నావు'' అనే మాటలు.

మాధవి మాటలు విని నేను ఉలిక్కిపడ్డాను. అప్పటిదాకా ఒక రకమైన ఉన్మత్త ధోరణిలో మాట్లాడుతున్న తన గొంతులో ఒక్కసారిగా దుఃఖం పొంగింది.

''వింటున్నావా అక్కా! ఆయన డబ్బుల కోసం నేను వగలు కురిపించానట. ఆ క్షణం నాకు.. నాకు నేనే ఒక వేశ్యలా...'' ఏడుపు మాటలకు అడ్డం రాగా ఫోన్ పెట్టేసింది.

రెండు నిమిషాల వరకూ నేనలాగే నిలబడిపోయాను. అప్పటికప్పుడు పరుగెత్తుకు వెళ్ళి తనని ఓదార్చాలనిపించింది. కానీ ఎక్కడ! ఉద్యోగం ఇంటిపని. కనీసం ఫోన్‌లోనయినా తీరికగా మాట్లాడే అవకాశం దొరకలేదు మళ్ళీ. వారం తర్వాత... యివాళ... వాళ్ళ పెళ్ళిరోజు.

ఒక స్వీట్ ప్యాకెట్, పూలు, పళ్ళు కొనుక్కుని ఆఫీసు నుంచి నేరుగా మాధవి వాళ్ళింటికే వెళ్లాను.

గేటు తీస్తూండగానే కనిపించింది వాకిట్లో తళతళా మెరుస్తూ కొత్త టూ వీలర్. మరో రెండడుగులు వేసి తలుపుదగ్గరికి వెళ్ళగానే వినిపించాయి ''ఇప్పుడు యింకో బండి కొనాల్సిన అవసరమేమొచ్చిందసలు! నా స్కూటర్ వుంది కదా!'' అని శ్రీధర్ మాటలు.

మాధవి సమాధానం చెప్పిందో లేదో వినపడలేదు. లోపలికి వెళ్ళడమా మానడమా అని నేను ఆలోచిస్తుంటే... మరోసారి వినబడింది శ్రీధర్ గొంతు.

''అయినా నన్ను సంప్రదించడం ఏమీ లేదా! నీ యిష్టం వచ్చినట్లు వెళ్ళి కొనుక్కొచ్చుకోవడమేనా?''

''మిమ్మల్ని సంప్రదించాల్సింది ఏముంది యిందులో? నాకు చేతనైన పని కనుక నేనే చేసుకున్నాను'' ఈసారి మాధవి మాటలు కూడా వినపడ్డాయి. కిటికీలో నుంచి వాళ్ళిద్దరూ స్పష్టంగా కనపడ్డారు కూడా.

''అవును. నీకు చేతకాని పనులేమున్నాయసలు! ఎంతటి పనులైనా చేయగల నెరజాణవి నువ్వు!'' శ్రీధర్ అరుస్తుంటే మాధవి పళ్ళు బిగువున చెప్పింది ''పిచ్చి పిచ్చిగా మాట్లాడకండి. నెరజాణ ఏమిటి? నన్ను గౌరవించి మాట్లాడకపోతే నాకూ మీమీద గౌరవం వుండదు''

''నీకు నేనంటే గౌరం ఎప్పుడేడ్చింది కనుక! నీకసలు కాపురం చేసే లక్షణాలుంటే కదా!''

అతని మాటలు పూర్తికాకముందే రెండు పిడికిళ్ళూ బిగించి ''శ్రీధర్!'' అంటూ ఉన్మత్తురాలిలా అరిచింది మాధవి.

అతను ఒక్క క్షణం మాధవి వైపు చిత్రంగా చూశాడు. ఆ వెంటనే మాధవి చెంప ఛెళ్ళుమనిపించి ''పేరు పెట్టి పిలుస్తావా నన్ను! అసలు నువ్వు ఆడదానివేనా?'' అన్నాడు.

నేను చలనం తెచ్చుకుని తలుపుతోసి లోపలికి అడుగు వేస్తుంటే... మాధవి పిచ్చి ఉద్రేకంతో ఊగిపోతూ అరిచింది.

''ఆడదాన్ని ఆడదానిగా గుర్తించడానికి మగతనం కావాలిరా... మగతనం వున్నవాళ్ళు శిలలో కూడా స్త్రీత్వాన్ని నిలపగలరు. అది లేనివాళ్ళు స్త్రీని కూడా శిలని చేయగలరు''


నేను ఒక్క అంగలో వాళ్ళ మధ్యకి వెళ్ళాను. ''మాధవీ! వూర్కో... ఏమిటా మాటలు!'' అన్నాను సగం మందలింపుగా, సగం వారింపుగా.

నన్ను చూస్తూనే మాధవి మొహం ఒక్క క్షణం పాలిపోయింది. ఆ వెంటనే ఓ దుఃఖపు వెల్లువ గొంతులో నుంచి వుబికి వచ్చింది. పెద్దగా ఏడుస్తూ, తల కొట్టుకుంటూ ''ఏంటక్కా నేనిలా అయిపోయాను ఏంటక్కా!'' అంది వెక్కిళ్ళ మధ్య.

నేను దగ్గరగా నడిచి భుజం మీద చేయివేశాను. మాధవి వెక్కిళ్ళు ఆగలేదు. నా భుజానికి తల కొట్టుకుంటూ ''ఇలా మాట్లాడేది నేనేనా అనుకుంటే నా మీద నాకే అసహ్యం వేస్తోంది. నేనెందుకిలా అయిపోయానక్కా! నేనెందుకిలా మాట్లాడుతున్నాను!'' అంది.

పిచ్చిదానిలా అది ఏడుస్తుంటే నేను సమాధానం చెప్పలేనట్లు నిలబడ్డాను. అవును! ఈమె నాకు తెలిసిన మాధవి కానే కాదు.

ఆడవాళ్ళకూ, మగవాళ్ళకూ వేరువేరు తత్వాలుండాలనీ... వెన్ను విరుచుకుని అహంకారం ప్రదర్శించడం మగతనమనీ... తల వంచుకుని సిగ్గులొలకపోయడం ఆడతనమనీ... ఇలాంటి ఉద్దేశ్యాలూ, భావాలూ మాధవికి లేవు. మరి యిప్పుడెందుకు వచ్చాయి ఆమె నోట్లో నుంచి అలాంటి మాటలు! అవి రాలేదు. అతను తెప్పించాడు.




ఇతనికెలా చెప్పడం! ఆడవాళ్ళయినా, మగవాళ్ళయినా యిద్దరూ మనుషులేనని... ధైర్యమూ, మంచితనమూ, నిజాయితీ, సత్యసంధతా, యిలాంటివి యిద్దరికీ వుండాల్సిన బేసిక్ లక్షణాలనీ యితనికి ఎలా అర్థం చేయడం.

పెళ్ళికి ముందు శ్రీధర్ అన్న మాటలూ, అతని కోరికలూ గుర్తొచ్చాయి నాకు. ''బాగా చదువుకున్న అమ్మాయి కావాలి మేడమ్! మంచి వ్యక్తిత్వం వున్న అమ్మాయి కావాలి మేడమ్!''

ఏమనుకుని కోరాడు అతనా కోరికలు! ఆ మాటలు విని కాదూ నేను మోసపోయింది! వ్యక్తిత్వం అంటే ఏమిటనుకున్నాడు యితను!

ఆమె అతని బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నిస్తే గయ్యాళి అన్నాడు. ప్రేమతో ఆ లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తే వగలాడి అన్నాడు. అతని మీద ఆధారపడితే చవటవన్నాడు. స్వతంత్రించి తనపని తను చేసుకుంటే నెరజాణవంటున్నాడు.

అసలు యితనికేం కావాలి? ఇతను భార్య నుంచి ఏం ఆశిస్తున్నాడు?

నేను కళ్ళు విప్పార్చుకుని శ్రీధర్ వైపు చూస్తుంటే, ఏమాత్రం పశ్చాత్తాపం ధ్వనించని స్వరంతో అతనన్నాడు–

''చూశారా మేడమ్! ఇదీ వరస. ఎందుకీవిడ చదువు, తగలపెట్టడానికి కాకపోతే! అలగా జనం కూడా యిలా బిహేవ్ చేయరు. ఎప్పుడూ ఏడుపే. అసహ్యం వేస్తోంది''

ఆ మాటలు వింటుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నాకిప్పుడు అర్థమయింది. మగవాడి దృష్టిలో స్త్రీ వ్యక్తిత్వం అంటే... డబ్బు సంపాదించగల సామర్థ్యం. భర్త సంపాదించి తెచ్చినా, తేకపోయినా బాధ్యతలు నెత్తికెత్తుకోగల ప్రయోజకత్వం, భర్తనుంచి ఏమీ ఆశించని... అతని మీద ఆధారపడని ధీరత్వం... వాటితోపాటు అతనికి అణగిమణగి వుండే సహనశీలత, అతను కొట్టినా తిట్టినా చిరునవ్వుతో చూడగల స్థితప్రజ్ఞత.

అవును. స్త్రీ వ్యక్తిత్వానికి వాళ్ళిచ్చే నిర్వచనం యిదే. భార్యలో వాళ్ళు యిలాంటి వ్యక్తిత్వాన్నే ఆశిస్తారు. ఇందుకు భిన్నమైన వ్యక్తిత్వం ఆమెకి వుంటే దాన్ని చంపేస్తారు.

ఈ నిజాన్ని నేను చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. ఒక నిండైన వ్యక్తిత్వం నిశ్శబ్దంగా హత్య చేయబడటానికి కారణమయ్యాను. ✪